క్లుప్తంగా

పక్కా ప్రణాళికతోనే గ్రామాల అభివృద్ధి

ఎంపీపీ కొండా దుర్గాభవాని

మునునూరు: పక్కా ప్రణాళికతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని, ఆ దిశగానే అధికారులు పనిచేయాలని ఎంపీపీ కొండా దుర్గాభవాని అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఈఓపీఆర్డీ బీపీ సత్యనారాయణ అధ్యక్షతన గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక, బ్లాక్ డెవలప్‌మెంట్ అభివృద్ధి ప్రణాళికపై రెండో రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కంచర్ల వాణి, దామోదరరావు, సత్యనారాయణ, పర్యవేక్షకుడు సాయిరాము, ఎంపీటీసీ సుబ్బారావు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

కళ్లజోళ్ల పంపిణీ



లోపూడి(మునునూరు): రాష్ట్ర ప్రభుత్వం దృష్టి లోపంతో ఇబ్బంది పడుతున్న వారిని గుర్తించి నేత్ర వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేస్తోందని జెడ్పీటీసీ డాక్టర్ వరికూటి ప్రతాప్, వైస్ ఎంపీపీ రాజానాయన అన్నారు. ఇటీవల జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా లోపూడి సచివాలయం పరిధిలో నిర్వహించిన వైద్య శిబిరంలో నేత్ర పరీక్షలు చేయించుకున్న 21 మందికి గురువారం సర్పంచ్ పేరం కృష్ణ కళ్లజోళ్లను అందజేశారు. నలుగురికి కంటి శస్త్రచికిత్సలు చేయించామని వారు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ అర్జునరావు, ఎంపీహెచ్ఎస్ కృష్ణారావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కులగణన సర్వేకు ఏర్పాట్లు

నూజివీడు: శుక్రవారం నుంచి మండలం, పట్టణంలో నిర్వహించనున్న కులగణన సర్వేకు ఏర్పాట్లు పూర్తయ్యాయని ఎంపీడీఓ వీఏ విజయ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ సయ్యద్ అబ్దుల్ రషీద్ అన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో ఉండే సెక్రటరీలకు క్లస్టర్‌లను కేటాయించామని, వలంటీర్లు ఇంటింటికి వెళ్లి కులగణన సర్వే నిర్వహిస్తారన్నారు. తర్వాత సామాజిక, ఆర్థిక పరిస్థితులు అన్నింటిని నమోదు చేసుకుని యజమాని, వలంటీర్, సెక్రటరీలు ఈకేవైసీ చేస్తారని, అప్పుడే ఆ కుటుంబం కులగణన సర్వే పూర్తయినట్లని చెప్పారు. కులగణనకు గాను నూజివీడు మండలం వలంటీర్లు, సెక్రటరీలు కలిసి దాదాపు 650 మందిని నియమించామన్నారు. ఐదుగురు మండల స్థాయి అధికారులను సూపర్‌వైజర్లుగా నియమించామని వివరించారు. పట్టణంలో దాదాపు 400 మందిని కులగణన సర్వేకు నియమించామన్నారు. సర్వేకు ప్రజలందరూ సహకరించాలని, సర్పంచ్‌లు, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు తోడ్పాటును అందించాలని వారు విజ్ఞప్తి చేశారు.

సామాజిక సమతా సంకల్ప వారోత్సవాలు



మైలవరం: మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 206 అడుగుల విగ్రహావిష్కరణను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు వారోత్సవాలు నిర్వహిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి తెలిపారు. వారోత్సవాల్లో భాగంగా డాక్టర్ అంబేడ్కర్ జీవితానికి సంబంధించి గురువారం విద్యార్థులకు వ్యాసరచన, డిబేట్, చిత్రలేఖనం, పాటలు, డ్యాన్స్ తదితర అంశాలలో పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడమే లక్ష్యం

జి.కొండూరు: గ్రామీణ క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలలో పాల్గొనేలా ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను నిర్వహిస్తోందని ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ అన్నారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా మండల స్థాయిలో వివిధ విభాగాలలో ప్రథమ స్థానంలో నిలిచిన క్రీడాకారులకు ప్రశంసా పత్రాలను స్థానిక కమ్యూనిటీహాల్‌లో ఎంపీపీ చేతుల మీదుగా గురువారం అందజేశారు. ఈ సందర్భంగా మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన మునగపాడు క్రికెట్ జట్టుకు గ్రామ సర్పంచ్ ట్రోఫీతో పాటు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌లుగా నిలిచిన క్రీడాకారులకు జ్ఞాపికలను అందజేశారు. చెర్వుమాధవరం సర్పంచ్ బాణావతు సరస్వతి క్రికెట్ బ్యాట్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అనూరాధ, అధికారులు పాల్గొన్నారు.

వాలీబాల్, ఖోఖో పోటీలు

చాట్రాయి: 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమంలో భాగంగా స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో మండల స్థాయి ఖోఖో, వాలీబాల్ పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. మండలంలోని 11 సచివాలయాల పరిధిలో మండల స్థాయికి ఎంపికైన క్రీడాకారులు ఈ పోటీల్లో ఆడుతున్నారు. రెండు విభాగాల్లోనూ క్రీడాకారులు తమ ప్రతిభను చాటారు.

● **నూజివీడు:** ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా మండల స్థాయి పోటీలు గురువారం పల్లెర్లమూడి హైస్కూల్‌లో నిర్వహించారు. షటిల్, కబడ్డీ, క్రికెట్ పోటీలు రసవత్తరంగా జరిగాయి. మీర్జాపురం, ముక్కొల్లుపాడు జట్ల మధ్య జరిగిన క్రికెట్ మ్యాచ్‌లో ముక్కొల్లుపాడు జట్టు విజయం సాధించింది. సతీష్, మల్లెల పంగిడయ్య ప్రతిభ కనబరిచి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు. కబడ్డీ పోటీల్లో రావిచర్ల, పాతపేట–1 జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో పాతపేట–1 విజయం సాధించింది. క్రీడా పోటీలను ఎంపీడీఓ బీపీ విజయ్‌కుమార్ ప్రారంభించగా, పీడీలు పి.రవీంద్ర, రాజకుమార్, రాజేశ్వరి, నాగమణి, స్వప్న, ఆరతి, రాజేంద్రప్రసాద్, రాణి తదితరులు పాల్గొన్నారు.

● **మునునూరు:** ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలతో పల్లె యువతలో ఉల్లాసం, ఉత్సాహం రెట్టింపయ్యాయని ఎంపీడీఓ జి.రాణి అన్నారు. మునునూరు హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో జరుగుతున్న ఆటల పోటీలను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా 8 సచివాలయాల పరిధిలోని క్రికెట్ టీమ్‌ల మధ్య నాలుగు మ్యాచ్‌లు జరిగాయన్నారు. ఆయా జట్ల క్రీడాకారులను ఆమె పరిచయం చేసుకున్నారు. పీడీలు ఆలీ, సుకుమార్‌లు జట్ల మధ్య పోటీలను నిర్వహించారు. ఈనెల 20న క్రీడా పోటీల ఫైనల్స్ నిర్వహిస్తామని పీడీ ఆలీ తెలిపారు. ఉపాధ్యాయులు, క్రీడాకారులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.



చాట్రాయిలో వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు





జి.కొండూరులో మునగపాడు క్రికెట్ జట్టుకు ప్రశంసా పత్రాలు, ట్రోఫీని అందజేస్తున్న ఎంపీపీ, సర్పంచ్‌లు : పల్లెర్లమూడిలో క్రికెట్ విజేత ముక్కొల్లుపాడు జట్టు

పేదల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం

ఎంపీ వివేక్ ఠాకూర్

ఆగిరిపల్లి: ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో పేదలకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని రాజ్యసభ సభ్యుడు, పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు వివేక్ ఠాకూర్ తెలిపారు. గురువారం మండలంలోని ఈదర సచివాలయంలో వికసిత భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ శాఖల వారీగా ఏర్పాటుచేసిన ఎగ్జిబిషన్ స్టాల్స్‌ను ఎంపీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఉజ్వల గ్యాస్ కనెక్షన్‌లను లబ్ధిదారులకు అందజేశారు. ఎంపీ వివేక్ ఠాకూర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై పలువురు అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. సబ్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, ఏలూరు జిల్లా పరిషత్ సీఈఓ కేఎస్ఎస్ సుబ్బారావు, ఎంపీపీ గోళ్ల అనూష, డీఎంహెచ్ఓ డాక్టర్ శర్మిష్ఠ, తహసీల్దార్ ఉదయ భాస్కర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రమ్ కిషోర్, నియోజకవర్గ కన్వీనర్ జీఆర్‌కే రంగారావు, మండల అధ్యక్షుడు కొవ్వలి బాబురావు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

ఆర్డీఓ మాధవి



తిరువూరు: పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలిన రెవెన్యూ డివిజనల్ అధికారి మాధవి అన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికలకు తిరువూరు నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను గురువారం ఆమె పరిశీలించి మాట్లాడారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అన్ని పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, ఇంటర్‌నెట్, మరుగుదొడ్లు, దివ్యాంగులు ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుగా ర్యాంపులు ఉండాలని చెప్పారు. అక్కపాలెం, వావిలాల, జీకొత్తూరు, చౌటపల్లి, పల్లెర్లమూడి, చిక్కుళ్లగూడెం, కాకర్ల తదితర గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. తహసీల్దార్ సురేష్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు భారీగా తరలిరావాలి

ఎంపీ కేశినేని నాని, ఎమ్మెల్యే వసంత

మైలవరం: ప్రపంచ మేధావి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు ప్రజలు తరలిరావాలని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ పిలుపునిచ్చారు. దేశమంతా గర్వించేలా, లోకమంతా గర్వించేలా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా విజయవాడ నడిబొడ్డున రూ.400 కోట్ల వ్యయంతో నిర్మించిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి భారీఎత్తున ప్రజలు తరలిరావాలన్నారు. మైలవరం మార్కెట్ యార్డులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతి వనం ప్రారంభోత్సవ పోస్టర్లను విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్(నాని), మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ గురువారం ఆవిష్కరించారు. విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో సామాజిక సమతా సంకల్ప సభను శుక్రవారం సాయంత్రం 4 గంటలకు నిర్వహిస్తారని, అనంతరం ఆరు గంటల నుంచి 8 గంటల వరకు విజయవాడ స్వరాజ్య మైదానంలో సామాజిక న్యాయ మహాశిల్పం పేరుతో నిర్మించిన 206 అడుగుల డాక్టర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించి జాతికి అంకితం చేస్తారని తెలిపారు. విగ్రహావిష్కరణతో పాటు అంబేడ్కర్ స్మృతి వనం ప్రారంభం ఉంటుందని, అంబేడ్కర్ ఫొటో గ్యాలరీ, జీవిత విశేషాలు, శిల్పాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఎంపీ కేశినేని శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి, ఎంపీపీ ఇస్లావత్ ప్రసన్నరాణిస్వామి, సర్పంచ్ గరికపాటి మంజుభార్గవి, వైఎస్సార్ సీపీ రైతు విభాగం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు జొన్నలగడ్డ గంగాధరరావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అప్పిడి కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మైలవరంలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ కేశినేని శ్రీనివాస్, ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ తదితరులు

సామాజిక న్యాయానికి చిహ్నం

నూజివీడు: విజయవాడలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం ఆవిష్కరించనున్న బీఆర్ అంబేడ్కర్ విగ్రహం సామాజిక న్యాయానికి చిహ్నంగా దేశ చరిత్రలో నిలిచిపోతుందని వైఎస్సార్ సీపీ నూజివీడు పట్టణ అధ్యక్షుడు శీలం రాము అన్నారు. నూజివీడు పట్టణంలో గురువారం సామాజిక సమతా సంకల్ప కార్యక్రమంలో భాగంగా బాపూనగర్ రోడ్డు, శ్రీనివాస సెంటర్‌లోని భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ 206 అడుగుల ఎత్తు గల అంబేడ్కర్ విగ్రహం ప్రారంభానికి ప్రజలు పెద్దఎత్తున తరలి రావాలన్నారు. సామాజిక న్యాయం గురించి భవిష్యత్ తరాలకు తెలియజేయాల్సిన బాధ్యత నేటి తరంపై ఉందని చెప్పారు. ఆ మహనీయుని స్ఫూర్తితో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో పాలన సాగిస్తూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్నారన్నారు. బీఆర్ అంబేడ్కర్ భారతీయులకు చెందిన వ్యక్తి అని ప్రజలందరూ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి రావాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సయ్యద్ అబ్దుల్ రషీద్, వైస్ చైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు, కౌన్సిలర్లు తలారి ధనలక్ష్మి, కొప్పుల ప్రదీప్, దాసరి మారు అప్పాజీ, కొడవటి రాంబాబు, నాయకులు తలారి సతీష్, కాలి సుగుణరావు, హరికోటి ప్రసాద్, చేబత్తిన మున్నా తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు తరలిరండి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): విజయవాడ నడిబొడ్డున విశాలమైన స్థలంలో అంబేడ్కర్ స్మృతివనంలో 206 అడుగుల అంబేడ్కర్ విగ్రహం నెలకొల్పడం దేశానికి ఆదర్శనీయమని బట్టరాజ కార్పొరేషన్ డైరెక్టర్ పోరంకి పద్మావతి అన్నారు. కొండపల్లిలో గురువారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. 206 అడుగుల అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు ప్రశంసనీయమన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా శుక్రవారం జరగనున్న ప్రారంభోత్సవానికి ప్రజలు వేలాదిగా తరలిరావాలని ఆమె కోరారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ పోస్టర్ల ఆవిష్కరణ

జి.కొండూరు: విజయవాడలో శుక్రవారం జరగనున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ పోస్టర్‌ను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మతో కలిసి వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు శరత్‌కుమార్ గురువారం ఆవిష్కరించారు. ముఖ్యమంత్రి చేతుల మీదుగా జరుగుతున్న ఈ మహా కార్యాన్ని జయప్రదం చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని శరత్‌కుమార్ కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ మండల అరుణ, నాయకులు పాల్గొన్నారు.



నూజివీడులో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు, కౌన్సిలర్లు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ లక్ష్మీతిరుపతమ్మ, శరత్‌కుమార్

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు తరలనున్న అభిమానులు

తిరువూరు: విజయవాడలో శుక్రవారం జరగనున్న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి తిరువూరు నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో అభిమానులు తరలివెళ్లనున్నారు. అన్ని గ్రామాల నుంచి ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సులు, ప్రైవేటు వాహనాల్లో మహిళలు, యువకులు విజయవాడ వెళుతున్నట్లు వైఎస్సార్ సీపీ నాయకులు తెలిపారు. 60 బస్సులను అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి వెళ్లేవారి కోసం ఏర్పాటు చేశారు.

అయోధ్య రాముడి అక్షింతల పంపిణీ



రోలుపడి(తిరువూరురూరల్): మండలంలోని రోలుపడి కోదండ రామాలయంలో గురువారం అయోధ్య రాముడి అక్షింతలను ప్రత్యేక పూజలు చేసి గ్రామంలో పంపిణీ చేశారు. ఆలయ ప్రతిష్ఠ ఆహ్వాన పత్రికలను, అక్షింతలను ఇంటింటికీ అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్ గొండేల రవికుమార్, ముష్టికుంట్ల పీఏసీఎస్ అధ్యక్షుడు బండి రవి, ఆలయ అర్చకులు జక్కేపల్లి నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పీఓఎస్ మిషన్ల ద్వారా టికెట్లు అందజేత



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో గురువారం పీఓఎస్ మిషన్ల ద్వారా టికెట్లు జారీ చేశారు. దేవదాయ శాఖ తన వెబ్‌సైట్‌లో సాఫ్ట్‌వేర్‌ను బుధవారం రాత్రి అప్‌డేట్ చేసింది. అయితే కొత్త సాఫ్ట్‌వేర్‌లో కొన్ని సాంకేతిక సమస్యలు ఎదురుకావడంతో గురువారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు దర్శన టికెట్ల జారీలో ఇబ్బందులు ఎదురయ్యాయి. దీంతో మహా మండపం దిగువన కౌంటర్లతో పాటు ఘాట్‌రోడ్డు, స్కానింగ్ పాయింట్ వద్ద కౌంటర్లలో టికెట్ల జారీ నిలిచిపోయింది. దీంతో దేవస్థాన సిబ్బంది టికెట్ల జారీలో ఎదురవుతున్న ఇబ్బందులను అధికారుల ద్వారా ఆలయ ఈవో కెఎస్.రామారావు దృష్టికి తీసుకెళ్లారు. అయితే అమ్మవారి దర్శనానికి విచ్చేసే భక్తులకు ఇబ్బందులు గురికాకుండా వెంటనే పీఓఎస్ మిషన్ల ద్వారా టికెట్లను జారీ చేయాలని టెక్నికల్ టీమ్‌కు సూచించారు. దీంతో గాలిగోపురం వద్ద ఉన్న స్కానింగ్ పాయింట్ వద్ద పీఓఎస్ మిషన్ల ద్వారా టికెట్లు జారీ చేశారు.

29న పదో తరగతి విద్యార్థులకు మోడల్ పరీక్ష

కృష్ణలంక(విజయవాడతూర్పు): పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఈ నెల 29వ తేదీ మధ్యాహ్నం 2 నుంచి 3.30 గంటల వరకు పబ్లిక్ మోడల్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు తెలిపారు. గవర్నర్‌పేటలోని బాలోత్సవం భవన్‌లో గురువారం ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ ఆధ్వర్యంలో పదో తరగతి మోడల్ పరీక్ష ప్రజ్ఞ వికాసంకు సంబంధించి వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులకు ప్రతి సంవత్సరం ప్రజ్ఞ వికాసం పేరుతో పబ్లిక్ మోడల్ పరీక్ష నిర్వహిస్తున్నామని చెప్పారు. నిష్ణాతులైన ఉపాధ్యాయుల చేత పరీక్ష పేపర్ తయారు చేయించామని తెలిపారు. విద్యార్థులు ఈ పరీక్ష రాయడం ద్వారా పబ్లిక్ పరీక్షల్లో అధిక మార్కులు సాధించడానికి ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థులందరూ ఈ పరీక్షను ఉపయోగించుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 9394755525, 8790865130, 9010849524 నంబర్లలో సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ వెంకటేశ్వరరావు, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి సుందరయ్య, ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు ట్యాంకర్ల ఏర్పాటు

ఎంపీ కేశినేని నాని, ఎమ్మెల్యే వసంత

మైలవరం: వేసవిలో నీటి ఎద్దడి ఉన్న గ్రామాల్లోని ప్రజల దాహార్తి తీర్చడానికి మంచినీటి ట్యాంకర్‌లు ఏర్పాటు చేస్తున్నామని ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని), ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ అన్నారు. మైలవరం మార్కెట్ యార్డులో ఎంపీ కేశినేని శ్రీనివాస్ ఎంపీ నిధులతో ఏర్పాటు చేసిన మంచినీటి వాటర్ ట్యాంకర్‌లను కేశినేని శ్రీనివాస్‌తో కలిసి గురువారం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ ప్రారంభించారు. ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ మాట్లాడుతూ నీటిఎద్దడి ఉన్న ప్రాంతాలకు తాగునీరు సరఫరా చేసేందుకు ఎంపీ కేశినేని శ్రీనివాస్ సౌజన్యంతో వాటర్ ట్యాంకర్‌లు ఏర్పాటు చేశామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తోందన్నారు. కేశినేని శ్రీనివాస్ మాట్లాడుతూ నీటి ఎద్దడి ఉన్న గ్రామాలకు మంచినీటి ట్యాంకర్‌లు ఏర్పాటు చేశామన్నారు. ట్యాంకర్‌లు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నియోజకవర్గంలోని గ్రామాల్లో పంచాయతీకి ఒక ట్యాంకర్‌ను అందజేశామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మీకుమారి, ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి, ఎంపీపీ ఇస్లావత్ ప్రసన్నరాణి స్వామి, సర్పంచ్ గరికపాటి మంజుభార్గవి, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు జొన్నలగడ్డ గంగాధరరావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అప్పిడి కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, కార్యదర్శులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వాటర్ ట్యాంకర్‌లు ప్రారంభిస్తున్న ఎంపీ కేశినేని శ్రీనివాస్, ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్

అపూర్వం.. ఆత్మీయ సమ్మేళనం



రమణక్కపేట(మునునూరు): కలసి చదువుకుని, స్నేహంగా మెలిగి, వివిధ స్థాయిల్లో స్థిరపడిన మిత్రులంతా గురువారం కలుసుకున్నారు. తాము చేసిన అల్లరి, చిలిపి చేష్టలు, స్నేహ బంధం, ఆత్మీయతలను నెమరు వేసుకున్నారు. దీనికి రమణక్కపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేదికైంది. ప్రస్తుత హెచ్ఎం రామకృష్ణ అధ్యక్షతన 1998–1999 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు తమ గురువులతో కలిసి గురువారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా నాటి హెచ్ఎం కేవీఎస్ఆర్ ప్రసాదరావు మాట్లాడుతూ చిన్నతనంలో విద్య నేర్పిన గురువులు, సహచర విద్యార్థులను విద్యాలయానికి రప్పించి, తీయని జ్ఞాపకాలు నెమరు వేసుకోవడం ఆనంద దాయకమన్నారు. అలనాటి ఉపాధ్యాయులు 15 మంది, విద్యార్థులు 52 మంది హాజరుకావడం అరుదైన విశేషమన్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రూ.12 వేల విలువైన ఐరన్ బీరువాను పూర్వ విద్యార్థులు హెచ్ఎంకు అందజేశారు.

20న దేవస్థానం పునర్నిర్మాణంపై గ్రామ సభ

తిరువూరు: స్థానిక బస్టాండ్ సెంటర్‌లోని పురాతన రామలింగేశ్వర స్వామి దేవస్థానం పునర్నిర్మాణంపై ఈ నెల 20న మధ్యాహ్నం 3 గంటలకు గ్రామ సభ ఏర్పాటు చేశామని దేవదాయ శాఖ మేనేజర్ జన్ను వెంకటేశ్వరరావు తెలిపారు. గతంలో ఆలయ పునర్నిర్మాణానికి అంచనాలు రూపొందించినప్పటికీ పట్టణంలోని మెయిన్‌రోడ్డు విస్తరణ జరుగనున్నందున పునఃపరిశీలన చేసే నిమిత్తం గ్రామ సభ నిర్వహిస్తామని చెప్పారు. వేంకటాచలస్వామి దేవస్థాన కల్యాణ మండపంలో జరిగే గ్రామసభలో భక్తులు, గ్రామస్తుల అభిప్రాయాలను తెలుసుకుంటామన్నారు.

23న హుండీ కానుకల లెక్కింపు

విస్సన్నపేట: పుట్రేలలోని మారెమ్మ అమ్మవారికి భక్తులు సమర్పించిన కానుకలను ఈ నెల 23వ తేదీ ఉదయం 10 గంటలకు లెక్కిస్తామని ఆలయ ఈఓ సీతారామయ్య గురువారం తెలిపారు. దేవదాయ శాఖాధికారి పర్యవేక్షణలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కోటగిరి సునీల్‌కుమార్, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు, రెవెన్యూ, పోలీస్ అధికారుల సమక్షంలో హుండీ కానుకలు లెక్కిస్తారన్నారు.

ట్రక్కు బోల్తాపడి వ్యక్తికి తీవ్ర గాయాలు

చాట్రాయి: జామాయిల్ ట్రక్కు పల్టీ కొట్టడంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని జనార్దనవరం గ్రామం నుంచి చాట్రాయి వైపు వెళ్తున్న జామాయిల్ ట్రక్కు ప్రమాదవశాత్తూ చాట్రాయి ఊర చెరువు వద్ద గురువారం రాత్రి పల్టీ కొట్టడంతో ట్రక్కుపైన ఉన్న ఆరుగొలనుపేట గ్రామానికి చెందిన బచ్చు శరణ్ జామాయిల్ కర్రల అడుగు భాగాన పడిపోయాడు. స్థానికులు కర్రలను తొలగించి తీవ్రంగా గాయపడిన శరణ్‌ను నూజివీడు ఆస్పత్రికి తరలించారు.

ఐదుగురికి గాయాలు

నందిగామ: ఆటో బోల్తా కొట్టడంతో ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. గురువారం 10 మంది ప్రయాణికులతో నందిగామ నుంచి హనుమంతుపాలెం బయలుదేరిన ఆటో మార్గమధ్యంలో అదుపుతప్పి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఐదుగురు వ్యక్తులకు స్వల్ప గాయాలయ్యాయి.